www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 4 నవంబర్ 2024 | 5 | ఏలూరు

ధాన్యానికి గిట్టుబాటు ధర ప్రకటించాలి

ప్రజాశక్తి - ముసునూరు

ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించి ప్రతి వడ్ల గింజ కొనాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు కోరారు. ముసునూరు సిపిఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు నెలల నుంచి వర్షాభావ పరిస్థితుల్లో నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. దళారుల వద్ద మోసపోకుండా ప్రభుత్వమే మద్దతు ధర ప్రకటించాలని, ఖరీఫ్ సీజన్ పూర్తయిన, రబీ సీజన్ మొదలవుతున్న ఇంకా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించలేదన్నారు. రైతులకు రాయితీ యంత్ర పరికరాలను అందించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం మండల నాయకులు సిహెచ్.శ్రీనివాసరావు, సిపిఎం మండల నాయకులు కొడవలి శ్రీనివాసరావు, కంచర్ల రమేష్, కంచర్ల దుర్గారావు, కంచర్ల శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

'బెల్టు' తీస్తారా..!

అనధికారికంగా మద్యం అమ్మకాల జోరు

ప్రతి దుకాణం పరిధిలో మూడు, నాలుగు బెల్టు షాపులు

క్వార్టర్ బాటిల్‌కు రూ.20 అదనంగా అమ్మకం

బెల్టు షాపులను పూర్తిగా కట్టడిచేసేనా అంటూ చర్చ

ఎక్సైజ్ అధికారుల దాడులు నామమాత్రమంటూ విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లో మద్యం ఏరులై పారుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్ ద్వారా దక్కించుకున్న ప్రతి దుకాణం పరిధిలోనూ మూడు నుంచి నాలుగు బెల్టుషాపులు కొనసాగుతున్నాయంటూ సర్వత్రా చర్చ కొనసాగుతోంది. బెల్టు షాపులపై ప్రభుత్వం సీరియస్‌గా హెచ్చరికలు జారీచేయడంతో పలు జాగ్రత్తలు తీసుకుని అనధికార మద్యం అమ్మకాలు సాగిస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం టెండర్ల ద్వారా ఏలూరు జిల్లాలో 144, పశ్చిమలో 175 మద్యం దుకాణాలకు అనుమతిచ్చింది. ప్రతి మద్యం దుకాణంలోనూ స్థానిక ఎంఎల్‌ఎలకు 30 శాతం వరకూ వాటాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అక్టోబర్ 16వ తేదీ నుంచి నూతన మద్యం దుకాణాల ఏర్పాటు జరిగింది. దుకాణాలు తెరిచిన వెంటనే బెల్టు షాపుల ఏర్పాటుకు పెద్ద ఎత్తున హడావుడీ జరిగింది. టిడిపి, జనసేన నాయకుల మధ్య బెల్టు షాపుల ఏర్పాటుకు పోటీ కొనసాగింది. బెల్టు షాపుల కోసం ఇరుపార్టీల నాయకులు ప్రత్యేక సమావేశాలు సైతం ఏర్పాటు చేసుకున్న పరిస్థితి. ఉంగుటూరు నియోజకవర్గంలో ఈ వ్యవహారం పెద్ద ఎత్తున సంచలనం సైతం రేపింది. బెల్టుషాపులపై మీడియాలో కథనాలు రావడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. బెల్టు షాపులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఎక్సైజ్ అధికారులకు సైతం కచ్చితమైన ఆదేశాలు జారీచేసింది. దీంతో ఒక్కసారిగా మద్యం వ్యాపారులంతా డైలమాలో పడ్డారు. అయినప్పటికీ ఏమాత్రమూ తగ్గలేదు. ప్రతి దుకాణం పరిధిలోనూ రహస్యంగా బెల్టు షాపులు నడిపిస్తున్నారు. బడ్డీకొట్లు, దుకాణాల పరిధిలో బెల్టు అమ్మకాలు సాగిపోతున్నాయి. బెల్టు షాపుల్లో బాటిల్‌కు రూ.20 అదనంగా వేసి విక్రయిస్తున్న పరిస్థితి నెలకొంది. బెల్టు షాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేస్తున్నట్లు చెబుతున్నా అవి నామమాత్రంగానే ఉన్నట్లు తెలుస్తోంది. మద్యం దుకాణాలపై

చింతలపూడి మండలం రాఘవాపురంలో బెల్టు షాపు

ప్రజాప్రతినిధుల పెత్తనం ఉండడంతో ఎక్సైజ్ అధికారులు సైతం ముందుకు అడుగువేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చింతలపూడి మండలం రాఘవాపురంలో బహిరంగంగానే బెల్టు షాపు కొనసాగుతున్నట్లు చెబుతున్నారు. టెండర్ ద్వారా కేటాయించిన మద్యం దుకాణాలు ఏలూరు జిల్లాలో 144 ఉంటే.. ఒక్కో దుకాణం పరిధిలో తక్కువగా లెక్కించినా మూడు బెల్టుషాపులు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అధికారిక, అనధికారికంగా 400లకుపైగా మద్యం దుకాణాలు కొనసాగుతున్నట్లు చర్చ సాగుతోంది. పశ్చిమగోదావరి జిల్లాలో అధికారికంగా 175 ఉంటే అనధికారికంగా బెల్టు షాపుల రూపంలో మరో 350 దుకాణాలు కొనసాగుతున్నట్లు అంచనా వేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం తణుకు మార్కెట్లో బహిరంగంగానే మద్యం అమ్మకాలు సాగించడం జిల్లా ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. ఇలాంటి ఘటనలు జిల్లాలో చాలా చోట్ల కొనసాగుతున్నట్లు చెబుతున్నారు.

విచ్చలవిడి మద్యం అమ్మకాల కట్టడిలో ప్రభుత్వాలు విఫలం

2014-19లో టిడిపి ప్రభుత్వం బెల్టు షాపులపై తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. వైసిపి ప్రభుత్వ హయాంలో నాటుసారా విచ్చలవిడిగా కొనసాగింది. అప్పట్లో కల్తీసారాతో జంగారెడ్డిగూడెం మండలంలో దాదాపు 20 మంది వరకూ చనిపోయిన పరిస్థితి నెలకొంది. విచ్చలవిడిగా సాగుతున్న మద్యం అమ్మకాలను కట్టడిచేయడంలో ఎక్సైజ్ శాఖ పూర్తిగా విఫలమవుతోందని జరిగిన పరిణామాలు తెలియజేస్తున్నాయి. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలతో యువత తప్పుదారి పడుతున్న పరిస్థితి ఏర్పడుతోంది. మద్యం షాపుల్లో ప్రజాప్రతినిధుల జోక్యం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే అక్రమ మద్యం అమ్మకాలకు చెక్‌పెడుతోంది. ఎంఎల్‌ఎల జోక్యం ఉండడంతో అధికారులు అటువైపు వెళ్లడానికి సంకోచిస్తున్న పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. మద్యం బెల్టు షాపుల కట్టడిలో ప్రభుత్వం మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

యాత్రికుల సౌకర్యార్థం.. ఆర్‌టిసి విస్తృత ఏర్పాట్లు

జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కార్తీక మాసంలో యాత్రికుల సౌకర్యార్థం ఎపిఎస్ ఆర్‌టిసి విస్తృత ఏర్పాట్లు చేసిందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ తెలిపారు. ఏయే డిపోల నుంచి ఏయే ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు? యాత్రికుల ఆదరణ ఎలా ఉంది? దసరా, దీపావళి సందర్భంగా ఆర్‌టిసి ఆదాయం ఎలా ఉంది వంటి ప్రశ్నలకు ప్రజాశక్తి జరిపిన ముఖాముఖిలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న : కార్తీకమాసంలో యాత్రికుల సౌకర్యం కోసం జిల్లాలో ఎటువంటి ఏర్పాట్లు చేశారు?

నాలుగో తేదీన కార్తీక సోమవారం సందర్భంగా ఏలూరు డిపో నుంచి పంచారామాలకు ఐదు బస్సులు ఏర్పాటు చేశాం. ఆదివారం రాత్రి అవి బయలుదేరుతున్నాయి. అలాగే శ్రీశైలానికి రెండు బస్సులు ఏర్పాటు చేశాం. అలాగే జంగారెడ్డిగూడెం నుంచి అన్నవరానికి రెండు బస్సులు ఏర్పాటు చేయడం జరిగింది.

ప్రశ్న : ఈ ప్రత్యేక బస్సులకు యాత్రికుల ఆదరణ ఎలా ఉంది?

యాత్రికుల ఆదరణ చాలా బాగుంది. బస్సులన్నీ ఇప్పటికే యాత్రికులతో బుక్ అయ్యాయి. వచ్చేవారం డిమాండ్‌ను బట్టి ఇంకా బస్సులు అవసరమైతే పెంచుతాం.

ప్రశ్న : దసరా, దీపావళి సందర్భంగా ఈ సంవత్సరం ఆర్‌టిసి ఆదాయం ఎలా ఉంది?

దసరాకు జిల్లా నుంచి 280 ప్రత్యేక బస్సులు వివిధ ప్రాంతాలకు నడిపాం. దాని ద్వారా 65 లక్షల రూపాయల అదనపు ఆదాయం ఆర్‌టిసికి వచ్చింది. అలాగే దీపావళికి హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చిన వారు తిరిగి వెళ్లడం కోసం ఆదివారం రాత్రి 12 ప్రత్యేక బస్సులు హైదరాబాద్ వెళ్లేందుకు ఏర్పాటు చేశాం.

ప్రశ్న : అయ్యప్పస్వామి మాలాధారణ మొదలైన తరుణంలో మాలాధారణ చేసినవారి కోసం శబరిమలై వెళ్లేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

నవంబర్ 16 నుంచి శబరిమలై అయ్యప్ప స్వామి దేవాలయం తెరుచుకోనున్న నేపథ్యంలో శబరిమలై వెళ్లేందుకు సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉంచాం. కిలోమీటర్‌కు 57 రూపాయల చొప్పున ఛార్జి చేస్తాం. అయితే సూపర్ లగ్జరీ బస్సుకు 35 మందిని మాత్రమే సాధారణంగా అనుమతించడం జరుగుతుంది. మాలధారణ చేసిన వారికి అదనంగా మరో ఐదుగురిని అదే ధరలో అనుమతించడం జరుగుతుంది.

ప్రశ్న : శబరిమలైకు బుక్ చేసుకునేందుకు ఎసి బస్సులు, స్లీపర్ బస్సులు అందుబాటులో ఉన్నాయా?

ఎసి స్లీపర్ బస్సులు ప్రస్తుతానికి అందుబాటులో లేవు. సూపర్ లగ్జరీ బస్సులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న : ఏలూరు బస్టాండ్‌లోని దుకాణాల్లో వాటర్ బాటిళ్ల దగ్గర నుంచి బిస్కెట్ ప్యాకెట్ల వరకూ ప్రతి వస్తువూ ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు అమ్ముతున్నట్లు అనేక ఫిర్యాదులు వస్తున్నాయి దీనిపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఈ విషయంపై ఇప్పటికే ప్రతి దుకాణం యజమానికీ చెప్పి హెచ్చరించాం. ఎంఆర్‌పి ధరలు ప్రదర్శించాలని కూడా చెప్పాం. ఎవరైనా ఈ విషయంపై ఫిర్యాదు చేస్తే ఆయా దుకాణాలపై చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్లకు ఆదేశాలు ఇచ్చాం.

ప్రశ్న : ఆర్‌టిసి కార్గో సర్వీస్ ఎలా నడుస్తోంది? కార్గో ద్వారా ఎంత ఆదాయం ఆర్‌టిసికి వస్తుంది?

ఆర్‌టిసి కార్గో సర్వీస్‌ను ప్రజలు బాగా ఆదరిస్తున్నారు. సకాలంలో చేరవేయడం, వారి వస్తువులకు భద్రత ఉండడం వంటి అంశాల వల్ల ఆదరణ చాలా బాగుంది. కార్గో ద్వారా ప్రతినెలా 30 లక్షల రూపాయలు ఆదాయం ఆర్‌టిసికి వస్తుంది.

ప్రశ్న : చివరగా ప్రజలకు మీరు ఇచ్చే సూచన ఏంటి?

ఆర్‌టిసిలో ప్రయాణించడం ద్వారా సురక్షితంగా ప్రజలు తమ గమ్యానికి చేరుకోవచ్చు. అలాగే ఆర్‌టిసి కార్గో సర్వీస్ ద్వారా ప్రజలు తమ వస్తువులను సకాలంలో తక్కువ ధరకే గమ్యాలకు చేర్చవచ్చు. ప్రజలు ఆర్‌టిసిని ఆదరించి సురక్షిత ప్రయాణం చేయడమే గాక ఆర్‌టిసి అభివృద్ధికి తోడ్పడాలని కోరుతున్నాను.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం స్వర్ణోత్సవ వేడుకలు ఏలూరు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లాలో స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్లోని డిసిఎంఎస్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఏలూరు జిల్లా ప్రథమ మహాసభలో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవడం ఉపాధ్యాయులందరి బాధ్యత అన్నారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలోకి వస్తున్న ప్రభుత్వాలు ప్రభుత్వ

మాట్లాడుతున్న డిఎన్‌విడి ప్రసాద్

విద్యారంగాన్ని పక్కదారి పట్టిస్తున్నాయని, దానికి వ్యతిరేకంగా పోరాటం చేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన

పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రారంభ సమావేశం, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎంబి.శ్యాంబాబు అధ్యక్షతన విద్యా సదస్సు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా ఆలీ అధ్యక్షతన ప్రతినిధుల సభ నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్షి రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా విద్య పట్ల ప్రభుత్వ వైఖరి మారడం లేదని, 117 జిఒను రద్దు చేస్తానని మాట ఇచ్చిన కొత్త ప్రభుత్వం ఇప్పటివరకూ దానిమీద ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదని, త్వరితగతిన 117 రద్దు చేసి పాఠశాల విద్యా వ్యవస్థను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, పశ్చిమగోదావరి జిల్లా ఎపి జెఎసి ఛైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు, సిఐటియు ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు వి.కనకదుర్గ, జిల్లా కోశాధికారి జివి రంగమోహన్, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్, ఆడిట్ కమిటీ సభ్యులు, 500 మందికి పైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపు సరికాదు

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పవన్‌కుమార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను సంక్షేమం పేరిట సంక్షోభంలోకి నెడుతోందని, విద్యుత్ ఛార్జీల పెంపు సరికాదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గోళ్ల పవన్ కుమార్ విమర్శించారు. నూజివీడులో పవన్ కుమార్ ఆదివారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. దీపం-2 పథకంలో భాగంగా మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చి, అమాంతం విద్యుత్ ఛార్జీలు పెంచడం వల్ల ప్రజలపై ఆరు వేల కోట్ల రూపాయలు పెనుభారం పడుతుందన్నారు. జగన్ పాలనలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచితే గగ్గోలు పెట్టిన కూటమి నేతలు, ఏ విధంగా సామాన్యులపై విద్యుత్ పెనుబారం మోపారని ప్రశ్నించారు. సంక్షేమం పేరిట ప్రజలను దోపిడీ చేస్తున్న విషయం అందరూ గమనిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో పాలకులకు అన్ని వర్గాలూ ప్రజలు తగిన గుణపాఠం నేర్పుతారని స్పష్టం చేశారు.

రాజీవ్‌నగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

పోలవరం ఎంఎల్‌ఎ బాలరాజుకు కెవిపిఎస్ వినతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందిస్తున్న కెవిపిఎస్ నాయకులు

బుట్టాయగూడెం మండలంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, గ్రామస్తులు ఆదివారం బర్రింకలపాడులోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ రాజీవ్ నగర్ కాలనీలో మౌలిక సమస్యలు పరిష్కరించాలని, కమ్యూనిటీ హాలు నిర్మించాలని, అదే విధంగా దళితపేటలో ఇళ్లపై ఉన్న 11 కెవి విద్యుత్ లైనును తొలగించాలని, డ్రెయినేజీలు నిర్మించాలని, కొన్ని చోట్ల ఉన్న డ్రెయినేజీలలో పూడిక తీయాలని తదితర సమస్యలను ఎంఎల్‌ఎకు వివరించినట్లు తెలిపారు. సమస్యలు విన్న ఎంఎల్‌ఎ త్వరలోనే గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బి.మంగకుమారి, వెంకాయమ్మ, మార్తమ్మ, సుజాత, పి.మందాకిని, ఎం.మేరీ పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంక్ ఎక్కి వైసిపి నేత నిరసన

టిడిపి నేతలు వేధిస్తున్నారని ఆవేదన

పోలీసుల హామీతో కిందకు దిగిన వైనం

ప్రజాశక్తి - చింతలపూడి

శ్రీనివాసరావుకు మాట్లాడుతున్న ఎస్ఐ

మండలంలోని యండపల్లి గ్రామంలో వైసిపి నాయకుడు మోరంపూడి శ్రీనివాసరావు వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. వైసిపి హయాంలో గ్రామానికి చెందిన తుమ్మల చెరువు (28 ఎకరాలు) పంచాయతీ పాట ద్వారా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఇఒపిఆర్‌డి అధికారి సమక్షంలో వేలం పాట ద్వారా శ్రీనివాసరావు మూడేళ్ల కాల పరిమితితో పాడుకున్నారని, మూడేళ్లుగా చేపలు సాగు చేస్తున్నట్లు సర్పంచి మోహన్‌రావు తెలిపారు. ఆ చెరువు ఆంధ్రా కాలువ పక్కన ఉండటంతో జనవరి నెలలో నీటి పారుదల శాఖ వారు కాలువ పనులు చేయటంతో కాలువగట్టు మొత్తం పూర్తిగా పాడైపోయిందని, రెండు లారీలు తప్పుకునే దారి ఇప్పుడు మనుషులు కూడా నడవలేని స్థితిలో ఉందని చెప్పారు. దీంతో శ్రీనివాసరావు పెంచుకున్న చేపలను తరలించడానికి వీలులేకుండా పోయిందని, దీనిపై పంచాయతీ కార్యవర్గం మరో సంవత్సరానికి లీజు పెంచాలని తీర్మానం చేసి పంపినట్లు సర్పంచి తెలిపారు. కాగా ప్రస్తుతం ఆ చెరువును పాట ద్వారా వేరే వారికి కేటాయించాలని ఒత్తిడి రావటంతో చెరువులో ఉన్న సుమారు 20 లక్షల చేపలను తరిలించే వీలు లేక తనకు ఆత్మహత్యే శరణ్యమని శ్రీనివాసరావు వాటర్‌ట్యాంక్ ఎక్కినట్లు తెలిపారు. తనను స్థానిక టిడిపి నాయకులు వేధిస్తున్నారని, పోలీసులు చర్యలు తీసుకోవాలని, చెరువుకు మరో సంవత్సరానికి లీజు పెంచాలని శ్రీనివాసరావు కోరాడు. విషయం తెలుసుకున్న చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడు శ్రీనివాసరావుతో మాట్లాడారు. టిడిపి నాయకుల నుంచి వేధింపులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో శ్రీనివాసరావు వాటర్‌ట్యాంకు దిగివచ్చారు. చెరువు లీజు విషయమై ఇప్పటికే కోర్టులో కేసు నడుస్తున్నట్లు సర్పంచి తెలిపారు.

తెల్లకాగితాలపై సంతకాలు ఎందుకు?

ఎస్‌ఎంసి సమావేశంలో ప్రశ్నించిన గ్రామస్తులు

కమిటీలో లేని వ్యక్తులు పెత్తనం చెలాయిస్తున్నారని ఆగ్రహం

ఉపాధ్యాయుల తీరుపై విమర్శలు

ప్రజాశక్తి - ముసునూరు

పేనుకు పెత్తనం ఇస్తే తలంతా గొరిగిపెట్టిందన్న చందంగా మండలంలోని ఎస్‌ఎంసిల పనితీరు ఉందని మండల ప్రజలు వాపోతున్నారు. మండలంలోని 16 గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీలు, పాఠశాల నైట్ డ్యూటీ చూస్తున్న వాచ్‌మెన్‌లను తొలగించడం, పాఠశాల పారిశుధ్య కార్మికులను తొలగించడం కోసమే కమిటీలు ఏర్పాటు చేసినట్లు వీరి వ్యవహార శైలి ఉందని విమర్శించారు. పాఠశాల వంట ఏజెన్సీలను, పారిశుధ్య కార్మికులను మార్చే అధికారం స్కూల్ మదర్స్ కమిటీ సభ్యులకు ఉందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కమిటీ సభ్యులందరికీ తెలియకుండానే కారణం లేకుండా ఇష్టారాజ్యంగా సక్రమంగా పిల్లలకు వంట చేసి వడ్డించే వంట ఏజెన్సీల వారిని తొలగిస్తూ వారి పొట్ట కొడుతున్నారన్నారు. ఇప్పటికే ముసునూరు హైస్కూల్లో వంటవారిని, నైట్ వాచ్‌మెన్ ను తొలగించి, మరొకరిని నియమించగా, తాజాగా మండలంలోని లోపూడి ప్రాథమికోన్నత పాఠశాలలో వంట ఏజెన్సీ వారిని, పారిశుధ్య కార్మికులను మార్చేందుకు గత వారం రోజులుగా పిల్లల చదువులను అటకెక్కించి, ఎస్‌ఎంసి సమావేశాలు నిర్వహించారు. దీనిలో సభ్యులు కాని వారు వచ్చి పెత్తనం చెలాయించడం దానికి ఉపాధ్యాయులు కూడా వత్తాసు పలకడంతో గ్రామస్తులు ఆగ్రహానికి గురయ్యారు. సభ్యులంతా సమావేశానికి రాకుండా, కోరం పూర్తి కాకుండానే వంట ఏజెన్సీల వారిని తొలగిస్తూ తీర్మానాలు చేసి, ఖాళీ తెల్లకాగితాలపై సంతకాలు చేయించడం, సమావేశానికి రానివారిని, సమావేశం ముగిసిన తర్వాత ఫోన్ చేసి పిలిపించి, తెల్ల కాగితాలపై సంతకాలు పెట్టించిన ఉపాధ్యాయుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్‌ఎంసితో గాని, పాఠశాలతో గాని సంబంధం లేని వ్యక్తులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు, పాఠశాల వద్ద కొంతసేపు ఇరుగ్రూపుల మధ్య అరుపులు కేకలతో



మాట్లాడుతున్న గ్రామస్తులు, ఎస్‌ఎంసి సభ్యులు

కూడిన ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో నాలుక కరుచుకున్న ఉపాధ్యాయులు బయట వ్యక్తులను పంపి వేసి సమావేశం నిర్వహించారు. వీరిలో కొందరు నేతలు మాట్లాడుతూ పాఠశాల ప్రభుత్వం నిర్వహిస్తుందా? లేదా గ్రామంలోని పెత్తనం చెలాయించే నాయకులు నిర్వహిస్తున్నారా? అని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ విషయాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఎస్‌ఎంసిల ద్వారా ఏడాది మధ్యలో, అర్ధాంతరంగా వంట ఏజెన్సీలు, పాఠశాల పారిశుధ్య కార్మికులు, నైట్ వాచ్ మెన్లను తొలగిస్తూ చేస్తున్న అన్యాయాలను అరికట్టాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

దళితులంతా ఐకమత్యంగా ఉండాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న దళిత నాయకులు

దళితులంతా ఐకమత్యంగా ఉండి దళితులపై జరిగే దాడులు, అన్యాయాలపై పోరాటం చేయాలని పలువురు దళిత నాయకులు అన్నారు. మండల కేంద్రమైన ముదినేపల్లిలో ఆదివారం రాత్రి బస్టాండ్ సమీపంలో దళితుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సమావేశంలో పాల్గొన్న దళిత నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు మాట్లాడుతూ దళితులంతా ఒకే తాటిపైకి వచ్చి పార్టీలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలన్నారు. దళితులందరూ సోదరభావంతో ఉండాలని, దళితుడు అనే వానికి ఏ ఒక్కరికీ అన్యాయం జరిగినా అందరూ కలిసి పోరాటం చేయాలన్నారు. ఒకరికొకరు అండగా ఉండి దళితుల సత్తా ఏంటో చూపించాలన్నారు. ఈ సమావేశంలో మండల నూతన కమిటీ ఏర్పాటు, మండల కమిటీ రిజిస్ట్రేషన్, తొలగించిన అంబేద్కర్ విగ్రహం పున:నిర్మాణం, నేషనల్ హైవే అధికారులపై పెట్టిన కేసు ఎంతవరకు వచ్చింది తదితర అంశాలపై చర్చించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం పున:నిర్మాణానికి నేషనల్ హైవే అధికారులు ఏర్పాటుచేసిన పిల్లర్‌ను దళిత నాయకులు పరిశీలించారు. ఈ దళిత ఆత్మీయ సమ్మేళనంలో దళిత నాయకులు బేతపూడి వెంకటరమణ, కె.ప్రవీణ్‌బాబు, విజయసాగర్, సోమల వరప్రసాద్, దగాని కోటేశ్వరరావు, ముత్యాల రాంబాబు, మొవ్వ ఫణింద్ర, కారే కోటేశ్వరరావు, పుట్టి నరసింహారావు, లేళ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ట్రిపుల్ ఐటి విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటి యోగశాలలో ఆర్‌జియుకెటి అంతర్ ప్రాంగణ యోగాసన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్ యోగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను నూజివీడు సంచా లకులు, రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్ర కుమార్ ప్రారంభించగా పరిపాలనాధికారి డాక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు. డిసెంబర్ 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు కెఐఐటి యూనివర్శిటీ భువనేశ్వరలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల యోగాసన పోటీల్లో పాల్గొనే జట్లను ఈ పోటీల్లో ఎంపికచేశారు. ఈవెంట్ (ఆరుగురు), వ్యక్తిగత (ఒకరు), రిథమిక్ (ఒకరు), ఆర్టిస్టిక్ (ఒకరు), మహిళా, పురుషుల మొత్తం 18 మందిని ఆర్‌జియుకెటి జట్లను ఈ పోటీల్లో ఎంపిక చేశారు. మహిళలు, పురుషుల్లో కేటగిరి మొత్తం నాలుగు విభాగాల్లో నూజివీడు యోగశాల విద్యార్థులే విజయం సాధించి అన్ని స్థానాలను కైవసం చేసుకొని తమ సత్తా చాటారు. ఆలిండియా పోటీలకు ఇప్పటివరకు విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహించిన విద్యార్థులందరూ నూజివీడు ట్రిపుల్ ఐటి యోగశాల విద్యార్థులే కావడం ఒక రికార్డ్. జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల యోగాసన పోటీల్లో ఇరు జట్లు పతకాలు సాధించి ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ కి ఎంపిక అవ్వాలని సంచాలకులు ఆకాంక్షించారు. యోగ శిక్షకుడు సత్య శ్రీధర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో స్థానమే లక్ష్యంగా ఇప్పటి నుంచి శిక్షణ జరుగుతుందన్నారు. యోగా విద్యార్థులు అకడమిక్స్‌తో పాటు యోగాసన పోటీల్లో అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా రాజమహేంద్రవరం శాప్ యోగా కోచ్ నాగేంద్రన్ వ్యవహరించారు. ఒంగోలు, శ్రీకాకుళం యోగా శిక్షకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎఐయు నేషనల్స్‌కి మొత్తం 18, ఎస్‌జిఎఫ్‌ఐ నేషనల్స్‌కి 11 స్థానాలకి నూజివీడు ట్రిపుల్ ఐటి యోగశాల విద్యార్థులు ఎంపిక అవ్వడంతో ఈ విద్యా సంవత్సరం నేషనల్స్‌లో మొత్తం 29 స్థానాలకు ప్రాతినిధ్యం వహిస్తూ సరికొత్త రికార్డు నెలకొల్పారు. విజేతలను ఎఒ లక్ష్మణ్, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ శంషాద్ బేగం అభినందించారు.



మాట్లాడుతున్న వక్తలు

'టిడిపి బలోపేతానికి కృషి చేయాలి'

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని టిడిపి నియోజకవర్గ వాణిజ్య సెల్ అధ్యక్షులు ఇమ్మడి రత్నాజీ అన్నారు. ద్వారకాతిరుమల తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం స్థానిక యాదవ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ వాణిజ్య సెల్ అధ్యక్షులు ఇమ్మడి రత్నాజీ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు చేసుకుని పార్టీకి అండగా నిలబడాలన్నారు. అలాగే త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల కోసం పట్టభద్రులను చేర్చేందుకు కృషి చేయాలన్నారు. టిడిపి 2024-2025 సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేసి అధిక సంఖ్యలో సభ్యత్వం ద్వారకాతిరుమలలో చేసి పార్టీ బలోపేతం చేయడానికి తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతకు జనసేన నేతల పరామర్శ

ప్రజాశక్తి - కామవరపుకోట

గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలో విశ్రాంతి తీసుకుంటున్న ఆర్‌టిఎ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కామవరపుకోటకు చెందిన మంచిరాజు ప్రసాద్‌రావు (మంకినపల్లి కర్ణం)ను కామవరపుకోట జనసేన పార్టీ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కామవరపుకోట టౌన్ అధ్యక్షుడు బొబ్బిలి వీరబాబు, మున్నంగి శ్రీనివాస్, సిరిగినేటి వెంకన్నబాబు పాల్గొన్నారు.



ప్రసాద్‌రావును పరామర్శిస్తున్న జనసేన నేతలు

'మనిషిని దోపిడీ చేసే సమాజం ఉండకూడదు'

ప్రజాశక్తి - కుక్కునూరు

ఒక మనిషి వేరొక మనిషిని దోపిడి చేసే సమాజం ఉండకూడదనిసిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథ జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కె.గౌస్ అన్నారు. జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ సమావేశం కుక్కునూరులో స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా నాయకులు బి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌కె గౌస్ మాట్లాడుతూ ఒక మనిషి వేరొక మనిషిని దోపిడి చేసే సమాజం ఉండకూడదని, దోపిడీ పీడనలేని వ్యవస్థ కోసం భారతదేశ విప్లవ ఉద్యమంలో పనిచేసి భూమి భుక్తి ఈ దేశ విముక్తికి స్మరిస్తూ ఈ నెల రెండో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు డివిజన్ వ్యాప్తంగా కుక్కునూరు, వేలేరుపాడు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం మండలాల్లో జరిగే స్మారక సభలను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు ఎస్‌కె గౌస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, బాసినేని సత్యనారాయణ, కంగాల కల్లయ్య, కారం సత్యవతి, ఎం.మల్లేష్, డివిజన్ నాయకులు కట్టం ముత్యాలరావు, సోయం చంద్రరావు, గడ్డం ముత్యాలరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రైలు నుంచి జారి పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలులో ప్రయాణిస్తున్న యువకుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందిన ఘటన భీమడోలు రైల్వే గేట్ సమీపంలో చోటు చేసుకుంది. ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రశాంత్‌కుమార్ (26) తన భార్య రష్మితతో కలిసి భువనేశ్వర్ నుంచి చెన్నై నగరానికి ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ రైలు బండిలో శనివారం బయలుదేరాడు. ఆదివారం రైలు ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని భీమడోలు రైల్వే గేట్ సమీపానికి చేరుకునే సరికి ప్రమాదవశాత్తు ప్రశాంత్ కుమార్ రైలు నుంచి జారిపడ్డాడు. ఈ ఘటనలో ప్రశాంత్‌కుమార్ తీవ్ర గాయాలపాలై ఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ సైమన్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంత్‌కుమార్ మృతదేహం

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. జీలుగుమిల్లి ఎస్ఐ పి.నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కనకాపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4400 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారందరిని స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

తాగునీరు వృధా.. ప్రజలకు వ్యధ..!

పైపులైన్లు ధ్వంసమై రహదారిపాలవుతున్న నీరు
తాగునీరందక గ్రామస్తుల అవస్థలు
ప్రజా సమస్యలు పట్టని పంచాయతీ

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజలకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం తారా స్థాయికి చేరింది. పైపులైను ధ్వంసమై తాగునీరు రహదారి పాలవుతున్న విధానం సర్పంచి నిర్లక్ష్యాన్ని తేట తెల్లం చేస్తుంది. గ్రామస్తులు తాగునీటి కోసం అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. చెరువులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ రూ.లక్షలు వెచ్చించి ఫిల్టర్ బెడ్లు మరమ్మతులు చేయించినప్పటికీ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందడంలేదు. అన్నీ ఉండి అల్లుడి నోట్లో శని అన్న చందంగా పరిస్థితి ఉందని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. సంపాదనపై సర్పంచికి ఉన్న శ్రద్ధ ప్రజలకు సేవలందించడంలో లేకపోవడంతో రూ.లక్షల ప్రజల సొమ్ము దుర్వినియోగమయ్యాయని ప్రజలు స్పష్టం చేస్తున్నారు .

మండవల్లి పంచాయతీ పరిధిలోని సుమారు ఆరు వేల మంది జనాభాకు పంచాయతీ పరమైన సేవలందించాల్సి ఉంది. వివిధ రకాల పన్నుల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నిధులతో తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, డ్రెయినేజీ, విద్యుత్ దీపాలు వంటి సదుపాయాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. పంచాయతీ సర్పంచికి సంపాదనపై ఉన్న శ్రద్ధ ప్రజలకు సేవలందించడంపై లేదని గ్రామస్తులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. దీంతో జాతీయ రహదారి వెంబడి సుమారు 11 చోట్ల పైపులైన్లు ధ్వంసమై నెలల తరబడి తాగునీరు రహదారి పాలవుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామంలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందక అలమటిస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటిని కొనుగోలు చేసి దాహార్తిని తీర్చుకుంటున్నామని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఫిల్టర్ బెడ్ల ద్వారా వస్తున్న తాగునీరు రహదారి పాలవుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదా అని, వృథాగా పోతున్న నీరు మీ కళ్లకు కనిపించడం లేదా అని నిలదీస్తున్నారు. అంతేకాకుండా గ్రామంలో సక్రమంగా విద్యుత్ దీపాలు వెలగక, డ్రెయినేజీ వ్యవస్థ లేక, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేక అనేక అవస్థలు పడుతుంటే పట్టించుకునే నాథుడు కరువయ్యాడని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. గ్రామానికి తాగునీరు అందించలేనప్పుడు రూ.లక్షలు వెచ్చించి ఫిల్టర్‌బెడ్లను మరమ్మతులు చేయించి ప్రజల సొమ్ము ఎందుకు దుర్వినియోగం చేశారని సర్పంచిని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇళ్ల మధ్య మురుగుతో, పందుల స్వైరవిహారంతో వ్యాధుల బారిన పడుతున్నా, గ్రామ సింహాలు గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడి చేస్తున్నా మీకు పట్టదా అంటూ నిలదీస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్పంచి మీ బాధ్యత, జవాబుదారి ఇదేనా అంటూ ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీని పరిశీలించి స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకుని గ్రామంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. దీనిపై ఇఒపిఆర్‌డి శేఖర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన సెలవుపై వెళ్లడంతో ఇన్‌ఛార్జి అడగడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

రహదారిపై నీరు

స్వచ్ఛమైన తాగునీరు అన్న సంగతే మర్చిపోయాం
మేదేపల్లి సైమన్, గ్రామస్తుడు

ప్రజలకు తాగునీటిని పంచాయతీ అందిస్తుందన్న మాట ఎప్పుడో మర్చిపోయాం. కుళాయిల ద్వారా నీళ్లు ఎప్పుడు వస్తాయో ఏమిటో తెలియదు. ఆర్ఒ వాటర్ ప్లాంట్ల నుంచి తాగునీటిని కొనుగోలు చేసుకుంటున్నాం. బావిలోని నీటిని వాడుకుంటున్నాం.

ప్రసాద్ కుటుంబానికి అబ్బయ్యచౌదరి క్షమాపణ చెప్పాలి

వైసిపి నాయకులు నీచ రాజకీయాలు మానుకోవాలి
దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి మండలంలోని కవ్వగుంట గ్రామానికి చెందిన గరికపాటి ప్రసాద్ కుటుంబానికి మాజీ ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి బహిరంగ క్షమాపణలు చెప్పాలని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. వైసిపి నాయకులు నీచ రాజకీయాలు మానుకోవాలన్నారు. కవ్వగుంట గ్రామంలో పశువులు, మూగజీవాలు నీరు తాగటానికి 2014 నుంచి 2019 వరకు ఎంఎల్ఎగా ఉన్న చింతమనేని ప్రభాకర్ ఒక నీటి తొట్టెను ఏర్పాటు చేయించారు. అనంతరం వైసిపి ప్రభుత్వం వచ్చాక గ్రామానికి చెందిన గరికపాటి ప్రసాద్, లక్ష్మి దంపతులు ఆ నీటి తొట్టె ప్రాంతాన్ని ఆక్రమించి దానిపై బడ్డీ కొట్టు ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆ గ్రామంలో గ్రామస్తులు ఆలయ నిర్మాణం చేపట్టారు. ఇందుకు బడ్డీ కొట్టు అడ్డుగా ఉండటంతో ఆలయ నిర్మాణం ఇబ్బది అవుతుందని ఇటీవల గ్రామ పర్యటనకు వచ్చిన ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌కు గ్రామస్తులు సమస్యను వివరించారు. దీంతో ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ గ్రామస్తులంతా మాట్లాడుకుని పంచాయతీ ద్వారా నిర్ణయం తీసుకుని గ్రామ కమిటీ ఎలా కావాలంటే అలా ముందుకు వెళ్లమని నిర్ణయం గ్రామస్తులకు వదిలేశారు. అనంతరం గ్రామస్తులంతా సమావేశమై పంచాయతీ ద్వారా కొట్టును తొలగించారు. మాజీ ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి దీనిని వక్రీకరించి దెందులూరు టిడిపి నాయకులు పెన్షనర్ అయిన ఓ వికలాంగుడి షాపు తొలగించారంటూ సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు తెరలేపి, సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లను ట్యాగ్ చేస్తూ పోస్టులు చేశారని గ్రామస్తులు తెలిపారు. దీంతో స్థానిక అధికారులు అవాక్కయ్యారు. ఆటో నడుపుతూ యధావిధిగా జీవిస్తున్న గరికపాటి ప్రసాద్ ఎలా వికలాంగుడు అయ్యాడని, అసలు పింఛన్ ఎలా పొందుతున్నాడని విచారణ చేపట్టారు. ఎలాంటి వైకల్యం లేకపోయినా గత వైసిపి నాయకులు చేసిన అవినీతి పనుల వల్ల ప్రసాద్ కూడా పెన్షన్ పొందుతూ ప్రభుత్వ సొమ్మును అక్రమంగా లబ్ధి పొందుతున్నాడని విచారణలో తేలింది. చివరికి ప్రసాద్ దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌ను కలిసి జరిగినదంతా వివరించి, తమను అడ్డు పెట్టుకుని వైసిపి నాయకులు చేసిన అసత్య ప్రచారాలు తమకు ఎలాంటి సంబంధం లేదని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే అబ్బయ్య చౌదరి అలా తప్పుడు పోస్టులు పెట్టారని వాపోయారు. దీంతో ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ నీచ రాజకీయాల కోసం ప్రసాద్ కుటుంబాన్ని వాడుకోవాలని చూసి సోషల్ మీడియాలో అసత్య ఆరో పణలు చేసిన అబ్బయ్యచౌదరి ముందుగా గరికపాటి ప్రసాద్ భార్యకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. చింతచచ్చినా పులుపు చావని చందాన ఓటమి ద్వారా ప్రజలు బుద్ధి చెప్పినా కూడా వైసిపి నాయకులు అబ్బయ్యచౌదరి ఇంకా నీచ రాజకీయాలు మారలేదంటూ కూటమి నాయకులు, దెందులూరు నియోజకవర్గ ప్రజలు అబ్బయ్యచౌదరి తీరును విమర్శిస్తున్నారు.

ప్రగతిపథంలో వాడవల్లి పంచాయతీ

సర్పంచి ఎస్.లక్ష్మీపద్మావతివెంకటరమణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వాడవల్లి గ్రామపంచాయతీ ప్రగతి పథంలో పయనిస్తోంది. ఒకప్పుడు అనేక సమస్యలకు నిలయంగా ఉన్న వాడవల్లి ప్రస్తుతం అన్ని రంగాల్లో దశలవారీగా అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతోంది. వాడవల్లి గ్రామసర్పంచి సుధాబత్తుల లక్ష్మీవెంకటరమణ, గ్రామ కార్యదర్శి ఎం.పవన్‌కుమార్ పట్టుదల, ఓర్పుతో గ్రామాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గ్రామంలో 2021 నుంచి ఇప్పటి వరకు పంచాయతీ నిధులు, ఎంజిఎన్‌ఆర్ఇజిఎస్ నిధులు, ప్రభుత్వ నిధులు, జలజీవన్ మిషన్ పథకం నిధులతో గ్రామంలో రూ.2.24 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

గ్రామంలోని గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం భవనాల పనులను రూ.83 లక్షలతో చేశారు. ప్రభుత్వ నిధులతో ఎంపియుపి పాఠశాలలో రూ.20 లక్షలతో పాఠశాల ఆధునికీకరణ, ప్రహరీ గోడ పనులు చేశారు. హిందూ, ఎస్‌సి శ్మశాన వాటికలకు దారి సౌకర్యం ఏర్పాటుకు రూ.మూడు లక్షలతో పనులు చేపట్టారు.

చెరువు అభివృద్ధి పనులు

నిర్మించిన సీసీ రోడ్డు

జలజీవన్ మిషన్

జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ పైపులైన్ కనెక్షన్ ఏర్పాటు చేసేందుకు రూ.42 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. జలజీవన్ మిషన్ కింద పైపులైన్ ఆధునికీకరణ ఇంటింటికి తాగునీరు ఇచ్చే కార్యక్రమాన్ని పూర్తి చేశారు. గ్రామంలో ప్రతి ఒక్కరికీ తాగునీరు అందుబాటులోకి తెచ్చారు.

పలు సిమెంట్ రోడ్డులు

గ్రామంలో పలు సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను రూ.40 లక్షలతో చేశారు. ఈ రోడ్లలో ఒకప్పుడు ప్రజలు నడవాలంటే చాలా ఇబ్బందికరంగా ఉండేది. వర్షం పడితే అంతర్గత రోడ్లు బురదమయమై ఈ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, నడవలేక ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. కొన్ని రహదారులు బాగోలేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను సర్పంచి గుర్తించి అధికారులతో మాట్లాడి సీసీ రోడ్లు మంజూరు చేయించారు. గ్రామ ప్రజలకు వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఈ సిమెంట్ రోడ్లు నాణ్యతతో నిర్మించారు.

రైతులు కోసం జిఎస్‌బి రోడ్డు

ఎనిమిది రోడ్లను జిఎస్‌బి రోడ్డు అభివృద్ధి పనులను రూ.10 లక్షలతో చేపట్టారు. రైతులు పండించిన పంటను తరలించేందుకు రహదారులు అధ్వానంగా మారడంతో రైతులు ఇబ్బందులు పడకుండా 1400 మీటర్ల పొడవునా మట్టి రోడ్డు నిర్మాణ పనులు రూ.8 లక్షలతో చేపట్టారు.

ఊర చెరువులు అభివృద్ధి

నాటి పాలకుల నిర్లక్ష్యంతో ఊర చెరువులు మట్టితో పూడుకుపోయాయి. ఊర చెరువులు గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వతంగా తీర్చిన కల్పతరువుగా మారాయి. భూగర్భ జలమట్టాన్ని పెంచి నీటి సమస్య లేకుండా చేసేందుకు దోహదపడుతున్నాయి. ఊర చెరువుల్లో పూడికను తొలగించారు. గ్రామంలో ఉన్న ఆరు ఊర చెరువులు అభివృద్ధి చేసేందుకు రూ.నాలుగు లక్షలతో పనులు చేపట్టారు. ఎస్‌డబ్ల్యూపిసి షెడ్ అభివృద్ధి పనులు రూ.రెండు లక్షలతో చేశారు. కమ్యూనిటీ కాంప్లెక్స్ అభివృద్ధి పనులను రూ.మూడు లక్షలతో చేపట్టారు. గ్రామంలో కచ్చా డ్రెయిన్ అభివృద్ధి పనులను రూ.నాలుగు లక్షలతో చేశారు. గ్రామంలో పిడబ్ల్యూఎస్ స్కీమ్ అభివృద్ధి పనులు రూ.నాలుగు లక్షలతో చేపట్టారు. పక్కా డ్రెయినేజీ అభివృద్ధి పనులను రూ.మూడు లక్షలతో చేపట్టారు.

ప్రగతి బాటలో పంచాయతీ
ఎస్.లక్ష్మీపద్మావతి వెంకటరమణ, సర్పంచి

గ్రామంలో ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుని పలు సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు చేశాం. ఆరు ఊర చెరువులు అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రస్తుతం గ్రామం ప్రగతి బాటలో పయనిస్తోంది. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నా ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో గ్రామ సచివాలయం, వెల్ నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రభుత్వ నిధులతో పాఠశాల అభివృద్ధి, జలజీవన్ మిషన్ పథకంలో ఇంటింటికి పైపులైన్ కనెక్షన్ ఏర్పాటు చేశాం. గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం.

పేదలకు కార్పొరేట్ తరహాలో ఉచిత వైద్యం

300 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దాలని ప్రతిపాదన
నూజివీడు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్రసింగ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పేద ప్రజలకు కార్పొరేట్ తరహాలో ఉచిత వైద్యం అందిస్తున్నామని నూజివీడు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.నరేంద్రసింగ్ అన్నారు. 300 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసి జిల్లా ఆసుపత్రిగా తీర్చిదిద్దాలని ప్రతిపాదించామని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 55 ఏరియా ఆసుపత్రుల్లో టాప్ 10 నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : నూజివీడు ఏరియా ఆసుపత్రిలో ఎన్ని వైద్య విభాగాలు ఉన్నాయి?

సూపరింటెండెంట్ : జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ప్రసూతి విభాగం, ఇఎన్‌టి, అత్యవసర చికిత్స విభాగం, ఒపి, ఐపి, ఆప్తమాలజీ, ధర్మటాలజి, డయాలసిస్ అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న : నూజివీడు ఏరియా ఆసుపత్రిలో ఏమేమి ల్యాబ్ పరీక్షలు ఉన్నాయి?

సూపరింటెండెంట్ : ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ స్కాన్, అన్ని రకాల రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు ఉన్నాయి. గంటన్నర వ్యవధిలో పరీక్షలు చేసి ఫలితాలను ఇస్తున్నాం.

ప్రశ్న : నూజివీడు ఏరియా ఆసుపత్రిలో ఎంత మంది వైద్యులు ఉన్నారు? ఎంతమంది వైద్యుల కొరత ఉంది?

సూపరింటెండెంట్ : నూజివీడు ఏరియా ఆసుపత్రిలో 23 మంది వైద్యులు ఉన్నారు. పిల్లల వైద్య నిపుణులు, జనరల్ ఫిజీషియన్ కొరత ఉంది. వారిని త్వరలో నియమిస్తాం.

ప్రశ్న : నూజివీడు ఏరియా ఆసుపత్రిలో గతేడాది మత్తు వైద్యులు కొరత ఉంది? ఇప్పుడు మత్తు వైద్యులను నియమించారా?

సూపరింటెండెంట్ : ఇప్పుడు మత్తు వైద్యులు ఇద్దరు ఉన్నారు.

ప్రశ్న : నూజివీడు ఏరియా ఆసుపత్రి ప్రస్తుతం ఎన్ని పడకల సామర్థ్యంతో ఉంది?

సూపరింటెండెంట్ : ప్రస్తుతం వంద పడకల ఆసుపత్రి ఉంది. 200 పడకల ఆసుపత్రి భవనం రూ.21.15 కోట్లతో నిర్మాణం దాదాపుగా పూర్తయింది. చిన్నచిన్న పనులు త్వరితగతిన పూర్తి చేసి 300 పడకల సామర్థ్యం గల ఆసుపత్రిని చేసి కార్పొరేట్ తరహాలో వైద్యం అందించడమే లక్ష్యం.

ప్రశ్న : గుండెపోటుతో వచ్చిన రోగికి తక్షణం అందించే ఇంజక్షన్ ఉందా?

సూపరింటెండెంట్ : గుండెపోటుతో ఆసుపత్రికి వచ్చిన రోగికి రూ.40 వేల ఖరీదైన ఇంజక్షన్ ఆసుపత్రిలో అందుబాటులో ఉంది. గుండెపోటు వచ్చిన రోగి ఒక గంట లోపు ఆసుపత్రికి వస్తే వెంటనే ఇసిజి తీసి గుండెపోటు నిర్ధారించి వెంటనే ఇంజక్షన్ చేసి 90 శాతం ప్రాణాలు కాపాడుతున్నాం.

ప్రశ్న : నూజివీడు ఏరియా బాలింతలకు ఏమైనా పథకాలు ఉన్నాయా?

సూపరింటెండెంట్ : బాలింతలకు 48 గంటల్లో ప్రభుత్వం వారు రూ.ఐదు వేల నగదు బాలింత ఖాతాలో చేస్తారు.

ప్రశ్న : అప్పుడే పుట్టిన పసి పిల్లలకు ఇంక్యుబేటర్ బాక్సులు ఉన్నాయా?

సూపరింటెండెంట్ : అప్పుడే పుట్టిన పిల్లలకు ఏమైనా ఇబ్బంది ఉంటే న్యూ బోర్న్ అంబులెన్స్ ఆక్సిజన్ ఇంక్యుబేటర్ సౌకర్యం కూడా ఉంది. ఎస్ఎన్‌సియు కేటాయించబడింది. మ్యాన్ పవర్ కోసం ప్రతిపాదనలు పంపాము.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, నీలాద్రిపురం గ్రామమునకు చెందిన కంచర్ల లక్ష్మీనారాయణ S/o.వెంకట రామారావు అను నాకు పాస్ పోర్టు నెం.**R9328983** పాస్ పోర్టు కలదు. నేను మోటార్ సైకిల్ పై నా పాస్ పోర్టు తీసుకుని చినతిరుపతి నుండి మా ఇంటికి నీలాద్రిపురం ది.**20-10-2024**వ తేదీన వెళుతుండగా మార్గమధ్యలో పడిపోయినది. నా పాస్ పోర్టు దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు ఫోన్ నెంబర్‌కు తెలియజేసి అందజేయగలరు.

అడ్రస్: **కంచర్ల లక్ష్మీనారాయణ,**
S/o.వెంకట రామారావు, డోర్ నెం 1-147,
కొత్తపేట నీలాద్రిపురం గ్రామం, తాడేపల్లిగూడెం మండలం, పశ్చిమగోదావరి జిల్లా. సెల్ :9642566122

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 13/2024

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్ -వాది

మరియు

D-1) తొంటా పెద్దింట్లు అండ్ అనదర్ -ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: తొంటా పెద్దింట్లు, W/o. ప్రభాకరరావు, డోర్ నెం. 3-115, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

D-2: వేముల శ్రీనివాస్, S/o. భాస్కరరావు, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 08-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 59/2020

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్ -వాది

మరియు

D-1) వేముల వర్ధనరావు మరియు యితరులు -ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: వేముల వర్ధనరావు, S/o. చిరంజీవి, డోర్ నెం. 4-105, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 12-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 181/2023

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్ -వాది

మరియు

D-1) పజ్జూరి మోహనరాణి మరియు యితరులు -ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: పజ్జూరి మోహనరాణి, W/o. రమేష్, డోర్ నెం. 3-115, 4వ బ్లాకు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

D-2: పజ్జూరి రమేష్, S/o. మల్లేశ్వరరావు, డోర్ నెం. 3-115, 4వ బ్లాకు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 05-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 229/2022

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్ -వాది

మరియు

D-1) తొంటా శ్రీనివాసరావు మరియు యితరులు -ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: తొంటా శ్రీనివాసరావు, S/o. రామారావు, డోర్ నెం. 25-11-14/1, రామయ్యహాలు వీధి 14వ బ్లాకు, శంబునిపేట, పాలకొల్లు.

D-2: తొంటా జ్యోతిలక్ష్మి, W/o. శ్రీనివాసరావు, డోర్ నెం. 25-11-14/1, రామయ్యహాలు వీధి, 14వ బ్లాకు, శంబునిపేట, పాలకొల్లు.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 12-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514